# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## శ్రీచెంగాళమ్మకు బంగారు హారం బహూకరణ

సూళ్లూరుపేట, నవంబర్ 19 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళ మాత పరమేశ్వరిదేవికి సూళ్లూరుపేటకు చెందిన ఉదయగిరి మధుబాబు దంపతులు బంగారు హారాన్ని ఆదివారం బహూకరించారు. 39 గ్రాముల 600 మిల్లీగ్రాముల బరువైన ఈ హారాన్ని దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి చేతులు మీదుగా దేవస్థానానికి అందజేశారు.

### తుమ్మలగుంటలో వేడుకగా

## శ్రీకల్యాణ వెంకన్న పుష్పయాగం

### దక్షిణాది రాష్ట్రాల నుంచి పుష్పాల సేకరణ



తిరుపతిరూరల్, నవంబర్19 ప్రభాతవార్త:

పరమ పవిత్రమైన కార్తిక మాసంలో శ్రణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం పుష్పయాగ మహోత్సవం వేడుకగా జరిగింది. సువాసనలు వెదజల్లే 14రకాల పుష్పాలు, 6రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. రంగు రంగుల పుష్పాలు, పత్రాల మధ్యన స్వామి, అమ్మవార్ల వైభవం భక్తులకు కనువిందు కలిగించింది. గత నెలలో స్వామివారికి జరిగిన తప్పులు, దోషాల నివారణకై పుష్పయాగం నిర్వహించడం అనవాయితీ. ఆలయంలో గల కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామికి సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు పుష్పయాగ మహోత్సవంను కన్నులపండవుగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు పట్టు వస్త్రా ఆభరణాలతో అందంగా అలంకరించి వేద మంత్రాల నడుమ పుష్ప కైంకర్యం చేసారు. చామంతి, వృక్షి, సంపంగి, సెంటు జాజులు, పోగడ రోజా, గన్నేరు, మల్లె మొల్లలు, కనకాంబరం, తామ ర, కలువ, మొగలి రేకులు, సంపంగి పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీ రు, కదిరి పచ్చపత్రాలతో స్వామి అమ్మవార్లకు అర్పించారు. ఈ సందర్భంగా వేద పండి తులు రుగ్వేదం, శుక్ల యజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదాలను పఠించి స్వామి అమ్మవార్లకు సాంత్వన కలిగింప చేసారు. ఆలయ అర్చక స్వాములు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో 20సార్లు స్వామి, అమ్మవార్లకు అర్పించారు. ఉత్సవమూర్తుల నిలువెత్తు వరకు ఉండేలా పుష్ప నివేదన చేపట్టారు. అనంతరం ఆలయ మాఢ వీధులలో ఊరేగింపుగా బయలుదేరి భక్తులను అనుగ్రహించారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన అనేక రకాల పుష్పాలను యాగానికి వినియోగించారు. పుష్పయాగంలో తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఏడుకొండలదేవుడికి పుష్పార్చన

### పుల్లుడి ఆవాహనతో 20సార్లు అర్చన





తిరుమల, నవంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:

పుష్పాలంకారప్రియుడు ఏడుకొండల వెంకన్న ఉత్సవర్లకు పవిత్రమైన కార్తీకమాసంలో శ్రవణానక్షత్రాన ఆదివారం మధ్యాహ్నం సువాసనలతో 17రకాల పుష్పాలు, 6రకాలపత్రాలతో ఎనిమిదిటన్నుల పుష్పార్చన జరిగింది. ఈ ఏడాది జరిగిన రెండు బ్రహ్మోత్సవాల్లో అర్చకుల వల్లగానీ, పరిచారకులు, భక్తుల వల్ల జరిగిన దోషాల నివారణకు పుష్పయాగం నిర్వహించడం సంప్రదాయం. ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ తిరుమల ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం 1గంట నుండి సాయంత్రం 5గంటల వరకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఉత్సవర్లకు పుష్పయాగ మహోత్సవం వేడుకగా నిర్వహించారు.

పుల్లుడు ఆవాహనంతో 20సార్లు పుష్పార్చన చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ,టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, జెఈఓ సదాభార్గవి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, విఎస్ఓ నందకిశోర్, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ ఉమామహేశ్వరరెడ్డి, అర్చకులు, గృహస్థభక్తులు పాల్గొన్నారు. అంతకుముందు తిరుమలలోని ఉద్యానవనం నుండి ఆలయానికి పుష్పాలను భక్తితో సాంప్రదాయంగా ఊరేగింపుగా తీసుకొచ్చారు.

**-ఉద్యానవన డిడికి సన్మానం:**

ఈ ఏడాది భారీగా తమిళనాడు, కర్నాటక,తెలుగురాష్ట్రాలనుండి సువాసనల పుష్పాలను దాతల నుండి సేకరించి పుష్పయాగం విజయవంతం చేయడంతో ఉద్యానవనవిభాగం డైరెక్టర్ శ్రీనివాసులును సన్మానించారు.



తిరుమలలోని ఉద్యానవనం నుండి ఆలయానికి పుష్పాలను భక్తితో సాంప్రదాయంగా ఊరేగింపు

### పద్మావతి అమ్మకు శోభాయమానం

## పుష్పశోభితం

తిరుపతి/తిరుచానూరు, నవంబర్ 19ప్రభాతవార్త:

తిరుచానూరు అలిమేలుమంగమ్మ ఆలయంలో ఆదివారం సాయంత్రం పాంచరాత్ర ఆగమోక్తంగా పుష్పయాగం నిర్వహించారు. దోషాల నివృత్తికోసం పుష్పయాగం చేపట్టారు. మధ్యాహ్నం వేదోక్తంగా ఆలయ అర్చకులు ఈ సువాసనల పుష్పాలను అమ్మవారి ఉత్సవమూర్తి పాదాలకు అభిషేకించారు.



## రామారావుకు స్వాగతం: సాగర్‌బాబుకు వీడ్కోలు

### బాధ్యతలు స్వీకరించిన ఇఓ



ఇద్దరు ఇఓలను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, నవంబర్ 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా ఫుల్ అడిషనల్ చార్జిగా నియమించిన కె.యస్ రామారావుకు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. అలాగే సుమారు ఏడాదిన్నర పాటు పని చేసి రెండు శివరాత్రులు నిర్వహించిన ఇఓ కె వి సాగర్‌బాబుకు వీడ్కోలు పలికారు. ఇరువురు అధికారులను చైర్మెన్ సారధ్యంలో సత్కరించారు. కొత్తఇఓకు స్వాగతం చెబుతూ పాత ఇఓకు వీడ్కోలు పలికారు. ఇద్దరిని చైర్మెన్ దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కొత్త గా బాధ్యతలు చేపట్టిన కెయస్ రామారావుతో చైర్మెన్ మాట్లాడుతూ ధర్మకర్తల మండలి అధికారులు సంయుక్తంగా పని చేసి శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని అభివృద్ధి చేస్తూ భక్తులకు విస్తృత సదుపాయాలు కల్పిద్దామని అంతేకాక భక్తుల మనోభావాలకు అనుగుణంగా పరిపాలనను అందిద్దామని ఇరువురు చర్చించుకున్నారు. కైలాసనాధుని కీర్తి నలుదిశల్లో వ్యాపించేలా కృషి చేయాలని చర్చించుకున్నారు. కాగా గత రెండేళ్ళుగా ఇఓగా సాగర్‌బాబు ఎన్నో నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టి ధర్మకర్తల మండలికి సహాకారం అందించటం ముదావహం అని దుశ్శాలువతో సత్కరించారు. ఈకార్యక్రమాల్లో ఎఇఓ ధనపాల్, డెప్యూటి ఇఓ వెంకటసుబ్బయ్య, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాభిమానుల కోసం భారీ స్క్రీన్ ఏర్పాటు

### ఇండియా - ఆస్ట్రేలియ వరల్డ్ కప్‌ఫైనల్ మ్యాచ్



గూడూరు, నవంబర్ 19, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి గ్రౌండ్ నందు జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేయడం జరిగింది. గూడూరు పట్టణ ప్రజలు క్రీడాకారులు, క్రీడాభిమానులు వచ్చి ఆనంద కోలాహలాల మధ్య మ్యాచ్ చూడడం జరిగింది. జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తాము అప్పటికప్పుడు స్క్రీన్ ఏర్పాటు చేయాలనుకున్నామని, తమకు అనుమతి దొరుకుతుందో లేదో అని అనుకున్నారని తెలిపారు. శాసన సభ్యులు వరప్రసాద్ రావు, ఆర్డిఓ కిరణ్ కుమార్‌కి తెలియజేయగానే వారు అనుమతి ఇచ్చారన్నారు. వారికి గూడూరు క్రీడాకారులు, క్రీడాభిమానుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

# సిఎం పర్యటనకు ముందుగా సమీక్షలు, సమావేశాలు

### అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనులు





తడ, నవంబర్ 19 ప్రభాతవార్త

ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఆదివారం తడ మండలం మాంబట్టు సెజ్ వద్ద జిల్లా స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులతో సందడి నెలకొంది. పోలీసు బలగాలు ఇప్పటికే పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. తిరుపతి జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు సూళ్లూరుపేట, తడలలో మకాం పెట్టి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఇటు తిరుపతి, అటు నెల్లూరు జిల్లాలకు సంబంధించిన భద్రత బలగాలతో పాటు అధికారులు కూడా ఈ కార్యక్రమాల్లో భాగం పంచుకుంటున్నారు. మరోవైపు వివిధ మండలాల్లో జనసమీకరణ కోసం ఏర్పాట్లు జోరందుకున్నాయి. సీఎం పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేసి విజయవంతం చేయాలని మరోసారి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశాలిచ్చారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి ఆయన మాంబట్టు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, ఇంటర్నెట్ సౌకర్యం, సిసి టివి కెమెరాల ఏర్పాటు, పర్యవేక్షణ, అంబులెన్స్, 108, మెడికల్ క్యాంప్ ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా, స్టాండ్‌బై జనరేటర్ ఏర్పాటు, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు, ఎల్ఇడి బ్యాక్‌డ్రాప్‌లతో పాటు సభా వేదిక వద్ద ఫొటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, సీటింగ్ ఏర్పాటు, మంచినీటి వసతి వంతి సౌకర్యాలపై పూర్తి దృష్టి కేంద్రీకరించారు. ఉదయం 10.20 గంటలకు మాంబట్టు సెజ్‌లోని హెలిప్యాడ్‌కు ముఖ్యమంత్రి చేరుకుంటారని, ఆయన వెంట పలువురు రాష్ట్రమంత్రులు కూడా ఉంటారని తెలుస్తోంది.

అనంతరం బహిరంగ సభ, అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపన, ప్రజాప్రతినిధులతో మాట్లాడటం వంటి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఆదివారం సూళ్లూరుపేట, గూడూరు ఎమ్మెల్యేలు కె.సంజీవయ్య, వరప్రసాదరావులతో పాటు ఈ ప్రాంతానికి చెందిన వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యంగా జాలర్ల కుప్పాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ అక్కడి నుంచే పెద్దసంఖ్యలో జన సమీకరణ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.



## సూళ్లూరుపేటలో కోటి సోమవారం పూజలు

సూళ్లూరుపేట, నవంబర్ 19 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలో కోటి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని పలు శైవ దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని శ్రీనాగేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పుష్పాలతో అలంకరణ చేశారు. అభయ శంకర దేవస్థానంలో స్వామివారికి అభిషేకాలు చేశారు. కోటి సోమవారాన్ని పురస్కరించుకొని మన్నారుపోలూరులోని శివాలయాల్లోను, పేర్నాడు శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

## కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయ క్యూలైన్లు.

# అరుదైన గౌరవానికి అపూర్వ ఆదరణ

-రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేదికగా చౌడేపల్లి
-సమర్థనిర్వహణా దిశగా యువత

చౌడేపల్లి, నవంబర్ 19 ప్రభాతవార్త

ఈనెల 24నుంచి 26వరకు జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-17 బాల, బాలికల పోటీలకు చౌడేపల్లి వేదికగా మారింది. ప్రభుత్వ మిచ్చిన ఇంతటి అరుదైన గౌరవానికి స్థానికంగా అపూర్వ ఆదరణ లభిస్తోంది. అండర్-17 బాల, బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అభ్యర్థనలు వెళ్ళాయి. అయితే కబడ్డీకి పుట్టిల్లు అయిన పుంగనూరులోనే పోటీలు జరగాలన్న తలంపుతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలు పట్టుపట్టి మరీ నిర్వహణా బాధ్యతలను తీసుకొచ్చారు. స్థానిక ఉన్నతపాఠశాల పిడి రామచంద్రయ్య, పిఇటి రాజేంద్రలు కబడ్డీ పోటీల నిర్వహణకు స్థానికులతో చర్చించారు.



దీంతో చిత్తూరు, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గాల వైకాపా యువత అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, పిల్లారి ఏజెన్సీస్ అధినేత పిల్లారి జీవన్‌ప్రకాష్, చౌడేపల్లి సర్పంచు శ్రీరామ్ భరత్‌వరుణ్, లీలాకుమార్‌నాగ్‌తోపాటు పాఠశాల పూర్వపు విద్యార్థులు సమావేశం ఏర్పాటు చేసుకొని నిర్వహణా బాధ్యతలు తీసుకొన్నారు. క్రీడా నిర్వహణకు నిధుల సమీకరణ చేపట్టారు. జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు రూ.లక్షతో ప్రారంభించారు. మేకల మోహన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, ఎస్ఆర్ కంస్ట్రెక్షన్స్ శ్రీనివాసులురెడ్డిలు రూ. 1.50లక్షలు అందించారు. అదే విధంగా, పావులూరి శ్రీనివాసులునాయుడు కుమారులు శ్రీలక్ష్మీకళ్యాణ మండపం, బైసాని లోకేష్ కళ్యాణ మండపాల్లో 4రోజుల పాటు క్రీడాకారులు మౌళిక వసతులను సమకూర్చేందుకు ఉచితంగా అందించారు.

## మహిళపై అత్యాచారం చేసిన వ్యక్తి అరెస్ట్

తవణంపల్లె, నవంబర్ 19 ప్రభాతవార్త:



మహిళపై అల్యాచారం చేసి ఆమె వద్ద నున్న నగదును బలవంతంగా లాక్కెళ్లిన వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణంపల్లె ఎస్సై బివి.సుధాకర్‌రెడ్డిలు తెలిపారు. వారి కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలానికి చెందిన మహిళ శుక్రవారం రాత్రి 8 గంటలకు మండలంలోని గాజులపల్లె బస్టాప్ వద్ద నిలబడి వుండగా చెర్లోపల్లెకు చెందిన రమేష్ అనే వ్యక్తి ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని మాయ మాటలు చెప్పి తన మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని ఈచనేరి వైపు వెళ్ళే కాలిబాటలోకి తీసుకు వెళ్ళి సమీపంలోని మామిడి తోటలో బెదిరించి అత్యాచారం చేసి, ఆమె వద్ద నున్న నాలుగు వేల రూపాయలను లాక్కుని ఈవిషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని హెచ్చరించి ఆమెను బీసీ కాలనీ సమీపంలో వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. దీనితో జరిగిన సంఘటనపై శనివారం బాధితురాలు తవణంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని ముద్దాయి రమేష్‌ను ఆదివారం అరగొండ-తవణంపల్లె రోడ్డులోని ప్రభుత్వ బాలు పాఠశాల వద్ద అరెస్ట్ చేసి అతని వద్ద నుండి రెండు వేల రూపాయలను, నేరానికి ఉపయోగించిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు వారు తెలిపారు.

## రోడ్డుపై జనసేన-దేశం వరినాట్లు

చిత్తూరు, నవంబర్ 19 ప్రభాతవార్త:

చిత్తూరు రూరల్ మండల పరిధిలో రోడ్లు అధ్వాన్నంగా వుండటంతో ఆదివారం జనసేన-తెలుగుదేశం ఆధ్వర్యంలో రోడ్లపై వరినాట్లు నాటి నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు రూరల్ మండల పరిధిలోని ఎన్ఆర్‌పేట నుండి చీలాపల్లి వరకు రోడ్డు గుంతల మయం కావడంతో జనసేన, తెలుగుదేశం నాయకులు ట్రాక్టర్‌తో మట్టితో గుంతలను పూడ్చి ప్రభుత్వ వైఖరికి నిరసనగా రోడ్లపై వరినాట్లు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, చిత్తూరు రూరల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శశిధర్‌బాబు, రఘులు, పార్లమెంట్ క్రిస్టియస్ సెల్ అధ్యక్షుడు మేషన్, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి గడప తొక్కుతాం.. ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తాం

- ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం(రామకుప్పం), నవంబర్ 19 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలోని ప్రతి గడప తొక్కి మాజీ సిఎం చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధిని వివరించి ప్రజల పక్షాన పోరాట ం కొనసాగిస్తామని ఎమ్మెల్సీ, తెదేపా సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం రామకుప్పం మండలంలో గతం గుర్తు చేసుకుందాం.. బాబు రుణం తీర్చుకుందాం కార్యక్రమంకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా గ్రామంలో పార్టీ పతాకావిష్కరణ చేసిన అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు హయాంలో కలిగిన లబ్ధి, చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. రాష్ట్రానికి మరలా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. కుప్పంలో చంద్రబాబును లక్ష మెజార్టీ సాధిస్తామన్నారు. 2024లో చంద్రబాబు సిఎం అయిన తొలిరోజు నుంచే కుప్పం అభివృద్ధి అజెండా అమలు చేస్తామన్నారు. కుప్పానికి పరిశ్రమలు తెస్తామన్నారు. తాను కూడా కుప్పంలోనే తన ఓటు హక్కు నమోదు చేయించుకున్నానని పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ డా॥ కంచర్లకు గ్రామాల్లో మహిళలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, నేతలు ఆంజనేయరెడ్డి, మునస్వామి, ఆనందరెడ్డి, రాజ్‌కుమార్, విశ్వనాథ నాయుడు, చౌడప్ప, గంట్లగౌడు, అనసూయ, నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఛలో మదనపల్లికి తరలిన మాలమహానాడు నేతలు

కుప్పం, నవంబర్ 19 ప్రభాతవార్త



మాలమహానాడు సిల్వర్ జూబ్లీ విజయోత్సవ సభకు గాను కుప్పం నియోజకవర్గ మాల మహానాడు నేతలు ఆదివారం మదనపల్లికి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కుప్పం, శాంతిపురం, గుడుపల్లె నుంచి వాహనాల్లో తరలారు. కార్యక్రమాల్లో నేతలు కన్నన్, డా॥ వెంకటేష్, కందస్వామి, మునస్వామి, రాజా తదితరులు ఉన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అమ్మా భవానీ కరుణించి కాపాడు...!!

బోయకొండ(చౌడేపల్లి), నవంబర్ 19 ప్రభాతవార్త



కోరినవారి కొంగు బంగారమా...కరుణించి కాపాడు తల్లీ...అంటూ భక్తులు అమ్మవారి ముందు మొకరిల్లారు. శక్తిక్షేత్రం బోయకొండ ఆదివారం భక్తజనసంద్రమైంది. ఉదయాన్నే అమ్మవారికి వేదపండి తులు, అర్చకుల ఆధ్వర్యంలో విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళి, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికార, సిబ్బంది సేవలందించారు.

## నూతన కార్యాలయం ప్రారంభం

బోయకొండ(చౌడేపల్లి), నవంబర్ 19 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండపై నూతన ఇఓ పరిపాలనా భవనాన్ని ప్రారంభించారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళిలు భవనాన్ని ప్రారంభించారు. ఇక నుంచి బోయకొండ పరిపాలనా కార్యక్రమాలు ఈ కార్యాలయం నుంచి ప్రారంభమవుతాయని వారన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు భాస్కర్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 65మంది ఎంపిక

కుప్పం, నవంబర్ 19 ప్రభాతవార్త



సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం కుప్పంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంకు విశేష స్పందన లభించింది. సుమారు 180మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 65మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. సోమవారం బెంగళూరులో వీరికి కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారు. కార్యక్రమాల్లో వైద్య బృందం శివప్రకాష్, శివ, లావణ్య, గాయత్రి, ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

## మహిళలకు ఉద్యోగంపై చర్చ పోటీలు

కుప్పం, నవంబర్ 19 ప్రభాతవార్త



జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా గ్రంథాలయ శాఖచే బిసి హాస్టల్‌లో మహిళలకు ఉద్యోగాలు అనే అంశంపై చర్చ పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థినులు ఈ అంశంపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వీరిలో విజేతలుగా నిలిచిన వారికి గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు అందించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి సత్యవాణి తెలిపారు.

## రోడ్ల అధ్వాన్నంతో జనసేన-తెలుగుదేశం నిరసన

పాలసముద్రం, నవంబర్ 19 ప్రభాతవార్త:



రహదారుల అధ్వాన్న స్థితికి నిరసనగా ఆదివారం జనసేన-తెలుగుదేశం ఆధ్వర్యంలో పాలసముద్రం మండలంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ డాక్టర్ యుగంధర్ పొన్న, మండల దేశం ప్రధాన కార్యదర్శి శశ్విర్‌రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వెంగళరాజుకుప్పం-చిత్తూరు-బలిజకండ్రిగ రహదారిలో నిరసన తెలిపారు. రహదారి మార్గంలో వున్న వంతెన కూలిపోయే పరిస్థితిలో వుండటంతో బాలకృష్ణాపురం ఆది ఆంధ్రవాడకు రహదారి ఎక్కడ! అని నాయకులు, కార్యకర్తలు నిలదీశారు. అధ్వాన్నంగా వున్న రహదారులను సత్వరం బాగు చేయాలని ప్రభుత్వంను వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆరుళ్‌నాధన్, జనసేన మండల అధ్యక్షుడు లతీఫ్, టిడిపి, జనసేన నాయకులు విజయ్‌కుమార్, ఎలుమలై, రాఘవ, అవినాష్, వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మాటల్లో కాదు... చేతల్లో చూపి ఓట్లు అడుగుతున్నాం

- ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

కుప్పంరూరల్, నవంబర్ 19 ప్రభాతవార్త

అభివృద్ధిని తాము మాటల్లో కాక చేతల్లో చూపించి ప్రజలను ఓట్లు అడుగుతున్నామని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. ఆదివారం మిట్టపల్లిలో ఎపి నీడ్స్ వై జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలు పథకాలతో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేదల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, రైతు భరోసా, విద్య, వసతి దీవెన ఇలా అనేక పథకాలు అమలు చేసి నేరుగా ప్రజల ఖాతాల్లోకే నగదు జమ చేసినట్లు తెలిపారు. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదని రేషన్‌కార్డు కావాలంటే జన్మభూమి



కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు సచివాలయాల్లోనే ఎంపిక చేయడం జరుగుతోందన్నారు. మిట్టపల్లి పంచాయతీకి నాలుగున్నర ఏళ్లలో 22కోట్ల నిధులు వచ్చాయని ఇందులో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రజలు మరోమారు సిఎం జగనన్నను ఆదరించాలని కుప్పం ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం మండలంలోని వెండుగంపల్లిలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్సీ భరత్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఎంపిపి అశ్విని, వైస్ఎంపిపి షౌకత్ అలీ, సర్పంచ్ కోడెప్ప, కో ఆప్షన్ అతహర్, వెండుగంపల్లి సర్పంచ్ ధరా మ్రచారి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పార్టీ కార్యకర్తలు నాయకులకు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, నవంబర్ 19, ప్రభాతవార్త



టిడిపి పార్టీ కార్యకర్తల నాయకులకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలంలోని చిలమనూరు గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు మురళి మాతృమూర్తి మృతి చెందడంతో భౌతిక పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎలాంటి సమస్య వచ్చిన అండగా ఉంటానని తెలిపారు. పార్టీ కూడా నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేసారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవికె ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నేదురుమల్లి అభినందనలు



వాకాడు, నవంబర్ 19, ప్రభాతవార్త

ఎన్‌బికెఆర్ విద్యా సంస్థల్లో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించిన అధ్యాపకులను రామ్ కుమార్ రెడ్డి ప్రశంసించారు. యూనివర్సిటీ స్థాయిలో ఎన్‌బికెఆర్ కళాశాలలో చదివిన వాకాడుకు చెందిన హిమజ, లావణ్య, ఉత్తమ ర్యాంకులు సాధించారు. అదే విధంగా ఎన్‌బికెఆర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన విద్యార్థిని విద్యార్థులు ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం నిర్వహించిన బిఎస్‌సి అగ్రికల్చర్ ప్రవేశ పరీక్షల్లో ఎన్‌బికెఆర్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల చదివిన రాష్ట్ర స్థాయి విత్తన పరిజ్ఞాన విభాగంలో కె. శివశంకర్ వరప్రసాద్ 8వ ర్యాంకు, మౌనిక 27వ ర్యాంకు, మీనాక్షి 32వ ర్యాంకు ఉత్తమ ర్యాంకులు సాధించారు. రామ్ కుమార్ రెడ్డి ప్రతి ఒక్కరిని అభినందించి బొకేలను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, శాసన మండలి విప్ ఎం. మురళీధర్, వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు అజిత్ కుమార్ రెడ్డి, నాగూర్ రెడ్డి, షనీల్ రెడ్డి, ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

## గుండెపోటుతో ఆలయ చైర్మన్ ఆనంద్ మృతి



చిల్లకూరు, నవంబర్ 19, ప్రభాతవార్త

మండలంలోని కలవకుండ గ్రామంలో కొండపై వెలసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ కందల ఆనందరావు (38) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు ఉదయం చాతిలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలియపరిచారు. ఇంతలాగా ప్రథమ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి బయలుదేరి గ్రామంలో ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆనంద రావు అభిమానులు గ్రామంలో ఒక్కసారిగా శోక సముద్రంలో మునిగిపోయారు. 2023 సంవత్సరం, అక్టోబర్ 27వ తేదిన ఆలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి నాడు అయితే అప్పటి నుండి ఆలయ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాడు.

# దశాబ్దాల స్వప్నం సాకారం కాబోతోంది

- సీఎం పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ
- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట, నవంబర్ 19 ప్రభాతవార్త

సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రప్రథమంగా ఈ ప్రాంత ప్రజలు దశాబ్దాల కాలంగా కలలుగంటున్న అభివృద్ధి కార్యక్రమాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో సాకారం కాబోతున్నాయని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ నెల 21న తడ మండలం కొండూరు వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రప్రథమంగా జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గానికి వస్తూ పలు వరాలు ప్రకటించారన్నారు. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో సుమారు 122 కోట్ల రూపాయలు వ్యయంతో పులికాట్ పూడిక తీత పనులకు శంకుస్థాపన చేస్తున్నారన్నారు. ఈ పనులు ప్రపంచ మత్స్యకార



దినోత్సవం సందర్భంగా శంకుస్థాపన చేసి మత్స్యకారుల వలలకు తుదిరూపు ఇచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే కాళంగి నదికి వాటంబేడు వద్ద రూ.10 కోట్లతో గ్రాయను నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. సూళ్లూరుపేట ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన శ్రీచెంగాళమ్మ దేవస్థానం సమీపంలోని కాళంగి నదిపై ఉన్న పురాతన వంతెనను తీసేసి దాని స్థానంలో రూ.35 కోట్ల వ్యయంతో మరో వంతెన నిర్మించేందుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా రూ.5.30 కోట్ల వ్యయంతో నిర్మించి పూర్తి చేసిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభిసానతరన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీఎం పర్యటన కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. పార్టీ నేతలు కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చెంగాళమ్మ దేవస్థానం ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో సవరణలు చేయండి

ఆర్డివో కిరణ్ కుమార్

గూడూరు, నవంబర్ 19, ప్రభాతవార్త



డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులో ఉన్న తప్పులను సరిచేయాలని డోర్ టు డోర్ సర్వేలో పని చేసే అధికారులు, సిబ్బందికి సూచించడం జరిగిందని గూడూరు ఆర్డివో కిరణ్ కుమార్ తెలిపారు. ఆదివారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గూడూరు డివిజన్ పరిధిలోని తహశీల్దారు బూత్ లెవెల్ ఆఫీసర్లతో డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ పై సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. గూడూరు ఆర్డివో కిరణ్ కుమార్, అధికారులు సిబ్బందికి పలు సూచనలు అందజేసారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటర్ లిస్టులో ఉన్న తప్పులను సరి చేసేందుకు డోర్ టు డోర్ సర్వే నిర్వహిస్తున్నామని, ఫామ్‌నెంబర్6,7 వినియోగంపైక్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు, సిబ్బందికి సూచించడం జరిగిందని తెలిపారు.

## సిఎం సభకు భారీగా ప్రజలు తరలిరావాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, నవంబర్ 19, ప్రభాతవార్త



ఈ నెల 21వ తేది మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా సిఎం జగన్మోహన్ రెడ్డి సూళ్లూరుపేట వస్తున్న సందర్భంగా భారీ ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎం సభకు వచ్చేందుకు వెంకటగిరి నియోజకవర్గం నుండి తగు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సూళ్ళూరుపేట నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో సిఎం పాల్గొంటారని చెప్పారు. సిఎం సభను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. 21వ తేది నియోజకవర్గంలో నుండి ప్రజలు భారీ ఎత్తున ప్రజలు తరలి రావాలని కోరారు.

## గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది

మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్



గూడూరు, నవంబర్ 19, ప్రభాతవార్త

రాష్ట్రంలోని రహదారుల దుస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసి కనువిప్పు కలిగించాలని తెలుగు దేశం పార్టీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం గూడూరు పట్టణ పరిధిలోని గూడూరు - విందూరు రహదారి దుస్థితిని ప్రజలకు తెలియజేస్తూ తెలుగు దేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు రహదారి వద్ద నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ఉన్న రహదారి పరిస్థితిని ప్రజలకు తెలియజేసారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ రోడ్ల పరిస్థితి గూడూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అధ్వానంగా ఉన్నాయని ప్రభుత్వానికి రోడ్ల దుస్థితి తెలియజేయాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇకనైనా ప్రభుత్వం రోడ్లపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, తిరుపతి పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి బిల్లు చెంచురామయ్య, గుండాల శ్రీదేవి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# భరతనాట్యం వరల్డ్ రికార్డు ప్రశంసపత్రాలు బహుకరణ

గూడూరు, నవంబర్ 19, ప్రభాతవార్త

శ్రీ సాయి నృత్య బృంద అకాడమీ, గూడూరు ఐసిఎండిఓ సంస్థ ఆధ్వర్యంలో సంగీత నృత్య మహోత్సవంలో అరిగిరి నందిని స్తోత్రం 10 వరల్డ్ రికార్డ్స్ మెగా ఈవెంట్ గత సంవత్సరం నిర్వహించారు. ఈ సంస్థ తరపున 40 మంది చిన్నారులు భరతనాట్యం నందు ప్రతిభ కనబరచి మెడల్స్, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. శ్రీ చైతన్య స్కూల్ ఆడిటోరియంలో ఉదయం నిర్వహించిన మెడల్స్, ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమానికి అధ్యక్షులుగా పెద్దిశెట్టి శ్రీనివాసులు, ముఖ్య అతిధిగా శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, సాయి సత్సంగ నిలయం పెద్దలు కోటా సునీల్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కోడూరు కల్పలత,



గూడూరు ప్రముఖ యోగా గురువు కట్టా మురళీకృష్ణ విజేతలైన చిన్నారులకు మెడల్స్, సర్టిఫికెట్స్ పంపిణీ చేసారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన సిద్దారెడ్డి దేవసేనమ్మ మాట్లాడుతూ 1999వ సంవత్సరం నుండి ఇప్పటి వరకు వందల కొద్ది చిన్నారులకు భరతనాట్యంలో తర్ఫీదు ఇస్తున్న సమస్త నాట్య గురువు పెద్ది శెట్టి శైలజ కుమారిని అభినందించారు. కోట సునీల్ మాట్లాడుతూ శ్రీ సాయి నృత్య బృంద అకాడమీ, గూడూరులో భరతనాట్యం నందు ఐకాన్‌గా నిలిచిందన్నారు. కోడూరు కల్పలత మాట్లాడుతూ భరతనాట్యం సర్టిఫికెట్స్‌కు చదువులలో, ఉద్యోగాలలో ప్రాముఖ్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భరతనాట్య గురువు పెద్ది శెట్టి శైలజ కుమారి, కోఆర్డినేటర్ కరీముల్లా ఖాన్, నజ్మా, ప్రజేంద్రా రెడ్డి, బాబర్, మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జంగం కుటుంబాలను ఆదుకుంటాం
బియ్యపు మధుసూధనరెడ్డి



శ్రీకాళహస్తి,నవంబర్ 19 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని ప్రతి జంగం కుటుంబాన్ని ఆదుకుంటామని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తి తేరువీధిలోని శ్రీహరికళ్యాణమండపంలో జంగం సంఘం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మాట్లాడుతూ ప్రతి జంగం కుటుంబానికి సొంత ఇంటి స్థలాలు,పట్టాలు అందజేస్తామని ప్రకటించారు.ఇప్పుడే జంగం సంఘం సభ్యులు కమ్యూనిటి హాల్‌ను కోరారు. అధికారులతో చర్చించి వెంటనే నిధులు మంజూరు చేస్తామని వివరించారు.అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ,అనుబంధంగా ఉన్న శివాలయాల్లో జంగం కులస్థులకు ప్రాధాన్యత ఉద్యోగవకాశాలు కల్పిస్తామని వివరించారు. జంగం సంక్షేమ సంఘం నూతన కమిటి మొదటి సమావేశాన్ని శ్రీహరి కళ్యాణమండపంలో ఏర్పాటు చేసారు.సంక్షేమ సంఘం అధ్యక్షులు చేజర్ల సుబ్బరాయులు, ఉపాధ్యక్షులు కారణి సుబ్రమణ్యం,కార్యదర్శి కారణి ఉదయ్‌కిరన్, ఉపకార్యదర్శి చేజర్ల చెంగయ్య,కోశాదికారిగా తలమంచి ప్రదీప్‌కుమార్, సభ్యులుగా పుల్లూరు మహేష్, గుండేటి శివకుమార్, చేజర్ల మనోజ్ సాయి, పాలచ్చూరు శంకర్, గడ్డం లోకేష్, ఈశ్వరవాకం శివకుమార్, చేజర్ల గంగాధరం, కారణికార్తీక్, పాలూరుమునిశివకుమార్, తలమంచి శివకుమార్, పాలూరు చంద్రబాబు, మైలాంగం మురళీ కృష్ణలు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డిని సత్కరించారు.కొత్తగా సంక్షేమ సంఘంగా నియమించిన సభ్యులతో ఎంఎల్‌ఏ మాట్లాడుతూ తనకు అన్ని వర్గాల ప్రజలు అవసరమని వారి సంక్షేమమే తన జీవిత లక్ష్యమని వివరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ప్రకాష్ యాదవ్ పాల్గొన్నారు.

## ఎస్‌పిఎఫ్ నిజాయితి
శ్రీకాళహస్తి,నవంబర్ 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం విపరీతమైన రద్దీ చోటు చేసుకుంది. ఆలయంలో సుమారు 4వేల రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. తమిళనాడు, కర్నాటక,కేరళ రాష్టానికి చెందిన భక్తులు వచ్చారు.ఈ సందర్భంగా కేరళ రాష్టానికి చెందిన లతారాజన్ అనేమహిళా భక్తురాలు ఆలయంలో నిర్వహించే రూ.2500ల పూజలు జరిపించుకున్నారు.ఈ సందర్భంగా ఆమె తన పర్సును పోగొట్టుకుంది.ఈ పర్సుఆలయంలో పనిచేసే ఉద్యోగులు గుర్తించి ఎస్‌పిఎఫ్ సిబ్బందికి అందజేసారు.వారు ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణానికి సమాచారం అందించారు.వారు బాధితురాల్ని గుర్తించి పర్సును అందించారు. ఆలయంలో పని చేసే ఉద్యోగుల నిజాయితిని లతారాజన్ అబినందించారు.

## ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన
తొట్టంబేడు, నవంబర్ 19 ప్రభాతవార్త




చిత్తూరు మాజీ ఎంఎల్‌ఏ స్వర్గీయ డికె. సత్యప్రభ మూడో వర్ధంతి సందర్భంగా బెంగుళూరుకు చెందిన వైదేహి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరంను పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న రోట రీక్లబ్‌లో బెంగుళూరులోని వైదేహి సూపర్‌స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్వర్గీయ దేవస్థానం చైర్మన్ గురవయ్యనాయుడు ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవకు ముందుకు వస్తున్నటన్లు డాక్టర్ రాజేష్ తెలిపారు. క్యాన్సర్,గుండెజబ్బు, నరాలజబ్బులకు సంబందించి ఈ వైద్యశిబిరంలో ప్రత్యేకశిబిరాలు నిర్వహించి తగిన వైద్యచికిత్సలకు సిఫార్సులు చేశారు. అనంతరం డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ తన తండ్రి మాజీ దేవస్థానం ఛైర్మన్ పోతుగుంటగురవయ్యానాయుడు ఎల్లప్పుడూ ప్రజలకు సేవ చేయాలన్న సూచనల మేరకు తన వంతు భాధ్యతగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు సేవలందించడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, తొట్టంబేడు మండల తెదేపా అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, తెదేపా పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, సర్గీయ ఆదికేశవులునాయుడు మనుమరాలు చైతన్య, రోటరీకార్యవర్గ సభ్యులు మ్యాగీక్లారా, డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కేంద్రమంత్రికి రుద్రాక్షలు
శ్రీకాళహస్తి, నవంబర్ 19 ప్రభాతవార్త



పట్టణంలోని ఎంజిఎం గ్రాండ్‌లో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లికృపారాణి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆమెకు ఎంజిఎం గ్రూప్స్ ఛైర్మన్ గుడ్లూరుమల్లిఖార్జునాయుడు శుభాకాంక్షలు తెలిపి రుద్రాక్షచెట్లకు పండిన రుద్రాక్షలను అందించారు. అనంతరం ఎంజిఎం ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్రమాజీ మంత్రి కిల్లికృపారాణి, డాక్టర్ రామమోహన్‌రావు మరియు ఎంజిఎం గ్రూప్ ఛైర్మన్ గుడ్లూరు మల్లిఖార్జునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై లైంగిక దాడులు అరికట్టేందుకే దిశ చట్టం



తిరుపతిరూరల్, నవంబర్19 ప్రభాతవార్త: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక దాడులను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టం తీసుకొచ్చిందని దిశ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ సుమతి తెలిపారు. 56వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం అన్నమయ్య కూడలిలో ఉన్న ప్రధమ శ్రేణి గ్రంధాలయంలో మహిళా సాధికారికత అనే అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమానికి అతిధిగా విచ్చేసిన ఏఎస్‌ఐ సుమతి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలను నియంత్రణకు ప్రభుత్వ దిశ చట్టాన్ని తీసుకొచ్చారని, అలాగే ప్రత్యేక కోర్టులను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దిశ చట్టంపై మహిళలకు అవగాహన కల్పించడంతో పాటు యాప్ డౌన్లోడ్‌కు క్యాంపెయిన్ కూడా నిర్వహించినట్లు తెలిపారు. మహిళ సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మెన్ మధబాల, గ్రంధాలయ అధికారి శివప్రసాద్,రత్నప్రభ, డాక్టర్ గిరిజా కుమారి, సోనిక దాగే, న్యాయవాది తహసున్నిస బేగం, మునిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ చిన్నోడుకి రంగస్థలి నివాళులు



రాయలసీమ చిన్నోడు పులికంటి కృష్ణారెడ్డికి రాయల సీమరంగస్థలి నాయకులు నివాళులర్పించారు.
ప్రభాతవార్త-తిరుపతి

## ఇందిరమ్మ ఆశయాలు బడుగువర్గాల ప్రజలకు ఆదర్శం
-కాంగ్రెస్ నేతలు



తిరుపతి,నవంబర్ 19ప్రభాతవార్త: స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ దేశంలోని నిరుపేదలకు కూడు,గుడ్డ,గూడు కల్పించడానికి గరీబీ హఠావో నినాదంతో కృషి చేశారని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం తిరుపతి చెన్నారెడ్డికాలనీలోఅంబేద్కర్‌భవన్‌లోఆమె చిత్ర పటం ఉంచి పుష్పాంజలి ఘటించారు. బ్యాంకు లను జాతీయం చేసిన ఆమె ప్రతి ఒక్కరికీ రుణా లు, బ్యాంకు సేవలను చేరువచేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ,అనుబంధ విభాగాల నాయకులు వెంకటనరసింహులు, గౌడపేరుచిట్టిబాబు, నన్నేఖాన్, బైలుగోపి, ప్రేమ్‌సాగర్, దూదిరమేష్, నాగరాజు, కృష్ణయ్య, గోవిందరాజులు, రాజశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు యూనియన్ బ్యాంకు
ఆఫ్ ఇండియా మెరుగైన సేవలు



తిరుపతి,నవంబర్ 19ప్రభాతవార్త: పూర్వ ఆంధ్రాబ్యాంకు (యూని యన్ బ్యాంకు ఆఫ్ ఇండియా) ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తుందని, బ్యాంకు ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని తిరుపతిలోని ఓ హోటల్‌లో ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు సమావేశమయ్యారు. స్వాతంత్ర్యసమరయోధుడు, ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభిసీతారామయ్య బ్యాంకును ఏర్పాటుచేసి నేడు ప్రజలకు బ్యాంకింగ్‌లో విశేష సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు యుబిఐ మెరుగైన సేవలందిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దామా శేషాద్రినాయుడు, విశ్రాంత జనరల్ మేనేజర్లు దొరస్వామి, చంద్రమోహన్‌రెడ్డి, నరేంద్రనాథ్‌రెడ్డి, ఉమాశంకర్,సుభాష్‌చంద్రరెడ్డి, రామమూర్తిరెడ్డి, నాదమునిరెడ్డి, వేణుగోపాల్, వేంకటేశ్వర్లు, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొని బ్యాంకు సేవలు గురించి, ఈ బ్యాంకింగ్ పనితీరు గురించి వివరించారు.

## గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది
టిడిపి



విజయపురం, నవంబరు 19 ప్రభాతవార్త : మండలంలోని బూచివానత్తంలో బూచివానత్తం - గంగమాంబా పురం రోడ్డులో మండల టిడిపి, జనసేన నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోడ్లు అధ్వాన్నంగా వున్నాయని, వాహనాలు సంగతి అటుంచి పాదచారులు సైతం ప్రయాణించలేకపోతున్నారని నాయకులు విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోడ్ల పరిస్థితి దిగజారిందని తెలిపారు. కనీసం రోడ్లపై గుంతలను కూడా పూడ్చడం లేదని దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి స్వామినాథన్, గౌరవాధ్యక్షుడు రాజేంద్ర రాజు, టిడిపి నాయకులు మురళీనాయుడు, మురళి, గోపాల్, బాబు, దొరైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా కన్వీనర్‌గా నారాయణస్వామిరెడ్డి



విజయపురం, నవంబరు 19 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నగరి నియోజకవర్గం కన్వీనర్‌గా కళియంబాకం గ్రామానికి చెందిన నారాయణస్వామి రెడ్డి నియమితులయ్యారు. గతంలో ఈయన మండల కిసాన్ మోర్చా కన్వీనర్‌గా పనిచేశారు. నిండ్ర నేతం చెరకు కర్మాగారంలో రైతుల బకాయిల కోసం పోరాటం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తనపై నమ్మకం వుంచి పదవి ఇచ్చినందుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా మునీశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేకం
విజయపురం, నవంబరు 19 ప్రభాతవార్త :



మండలంలోని కమ్మకండ్రిగ - ఒరూరు మధ్యలో నిర్మాణమవుతున్న మునీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గ్రామస్తులు కుంభా భిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం పూర్ణాహుతి, అభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి మునీశ్వరస్వామివారిని పురవీ ధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## క్షేత్రపరిరక్షణ సమితిచే సత్కారం
శ్రీకాళహస్తి,నవంబర్ 19 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా ఆదివారం కె యస్‌రామారావు బాధ్యతలు స్వీకరరించిన సందర్భంగా శ్రీకాళహస్తి క్షేత్ర పరిరక్షణ సమితిచే సత్కరించారు. శ్రీకాళహస్తి ఆర్‌డిఓగా కె యస్ రామారావు స్థానిక నాయకులు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలకు ధార్మిక సంస్థలకు సుపరిచయస్తులే.గతంలో ఆలయ కార్యనిర్వహణాధికారిగా రామారావు వస్తారని భావించారు.కానీ అప్పుడు సాధ్యం కాలేదు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారని తెలిసిన వెంటనే క్షేత్ర సమితి దుశ్శాలువతో సత్కరించారు.ఈ మేరకు సభ్యులు పి.రమేష్‌బాబు, కుసుమ గణేష్, జి.నాగరాజశెట్టి, పులి రాధాకృష్ణ, స్వర్ణమూర్తి, ఉదయగిరి మోహన్, వి.భారతి, శ్రీరాములు,షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

## అవదూత ఆరాధనోత్సం: సామూహిక కార్తీక వనభోజనం
శ్రీకాళహస్తి,నవంబర్ 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లతో పాటు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలో కార్తీక మాసం వనభోజనాలు,సామూహిక భోజనాలు ఏర్పాటు చేసారు.శ్రీకాళహస్తిలో అవదూత వేణుగోపాల స్వామి 46వ ఆరాధనోత్సవాలును భక్త బృందం ఏర్పాటు చేసారు.ఈ సామూహిక భోజనాల కార్యక్రమాల్ని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు ప్రత్యేక పూజలు జరిపి ప్రారంబించారు.ఆరాధనోత్సవ కమిటి సభ్యులు న్యాయవాది గరికపాటి చంద్రశేఖర్, గరికపాటి రమేష్‌బాబులు పర్యవేక్షించారు.వేణుగోపాల స్వామి వారి సమాధి వద్ద పూజలు జరిపి వనభోజన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ విశిష్టమైన కార్తీక మాసం మొదటి సోమవారం వేణుగోపాల స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా వనభోజనాలు ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు.కార్తీక మాసం అంతా విరివిగా వనభోజనాలు ఏర్పాటు చేసి భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ చైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్,చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు ఆయన అనుచరులు పాల్గొన్నారు. వైసిపి నాయకురాలు ఎంఎల్‌ఏ కుమార్తె పవిత్రారెడ్డి, జనసేన నాయకురాలు నగరం వినూతనచంద్రశేఖర్, చైతన్య రాజేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన భక్తులు, ప్రజలకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలను శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,మాజీ చైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్‌లు ప్రారంబించారు.

# తిరుపతి డివిజన్

## హౌస్ అరెస్టులు.. నోటీసులతో ఉద్యమాన్ని ఆపలేరు
శ్రీకాళహస్తి, నవంబర్ 19 ప్రభాతవార్త

ఈనెల 19న చిత్తూరులో ఎపిసిపిఎస్‌ఈఏ(ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూషనరి ఫెన్షన్ ఎంప్లాయిస్ అసోసియేషన్) సిపిఎస్ ఉద్యోగులు తలపెట్టిన ఆత్మగౌరవసభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఈనెల 18వ తేదీ రాత్రికి దాదాపు 400మంది చేరుకున్నారు. అది తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఇంటిజెన్సీ విభాగం మరియు పోలీస్ అధికారులు కలసి చిత్తూరు జిల్లాలో సభకు వెళ్ళనీయకుండా ఆదివారం ఉదయం సుమారు 3వేలమంది రావచ్చని అంచనా వేసి పోలీస్‌శాఖ ప్రభుత్వంతో కలసి సభ జరగనీయకుండా రాత్రికి రాత్రే ఏపిసిపిఎస్‌ఈఏ చిత్తూరు జిల్లా కమిటీని పోలీసులు అదుపులోకి తీసుకుని ఏర్పాటు చేసుకున్న సభను తొలగించడం ఉద్యోగస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.సుబ్బారెడ్డి మరియు అధ్యక్షులు వి.గంగయ్యలు తెలిపారు. ఉద్యోగస్తులను సంఘవిద్రోహక శక్తులుగా చూస్తూ సభలు, సమావేశాలకు వెళ్ళనీయకుండా అరెస్టులు, నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సబబన్నారు. శాంతి యుతంగా తమసమస్యలను చర్చించుకుని ఏవిధంగా ముందుకు వెళ్ళాలో ఈజిపిఎస్‌లో ఇంతకుముందు ఉన్నటువంటి గ్రాడ్యుటీ పిఆర్సీలు, డిఏలు ఉన్నాయో లేదో చర్చించుకుని తెలుసుకోవడానికి తాము సమావేశం నిర్వహించామే తప్ప తాము ప్రభుత్వానికి వ్యతిరేఖం కాదని సభలను అడ్డుకోవడం ఈ ప్రభుత్వం చేస్తున్న తప్పిదంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ఇస్తామని చెప్పి జిపిఎస్ అని సిపిఎస్ ఉద్యోగులపై రుద్దడం వల్ల తమ ఆత్మగౌరవం దెబ్బతిని తమ సమస్యలను చర్చించుకోవడానికి తాము సమావేశం అవుతున్నామే తప్ప ర్యాలీలు, ధర్నాలు కానీ చేయలేదని అయినా సభను అడ్డుకోవడం సబబుకాదన్నారు. గతంలో విజయవాడ సభలో సభను అడ్డుకున్నారని నేడు చిత్తూరు జరిగే ఆత్మగౌరవ సభకు రాకుండా కర్నూలు, నంద్యాల, ఆళ్ళగడ్డ, మదనపల్లి, పీలేరు, విజయవాడ, గుంటూరు, నెల్లూరులో పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఉద్యోగస్తుల సమస్యలను సామరస్యంగా వినిపరిష్కరించాలే తప్ప ఇలా అరెస్టులు, నోటీసులు, అడ్డుకోవడాలు మంచిదికాదన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరాగాంధీ వేడుకలు
పుత్తూరురూరల్, నవంబరు 19 ప్రభాతవార్త:



56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుత్తూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఇందిరాగాంధీ జన్మదినం సందర్భంగా మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పుత్తూరు మండలం ఎస్ఆర్ చెరువు ప్రధానోపాధ్యాయురాలు టి.కె.దేవి మాట్లాడుతూ ఇందిరాగాంధీ జీవిత విశేషాలను, ఆమె యొక్క పట్టుదల, రాజకీయ జీవితం వంటిపలు విషయాలను స్మరించుకోవడం జరిగింది. ఇందిరాగాంధీ తనతండ్రి జవహర్‌లాల్ నెహ్రూ జైలు నుంచి రాసిన ఉత్తరాల ద్వారా ఉత్తేజితురాలై తనను తాను ఉన్నతంగా మలచుకున్నారని దేశ ప్రథమ మహిళా ప్రధానిగా అత్యున్నతంగా రాణించారని అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని ప్రతి మహిళా తన భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. మహిళ రక్షణకై ప్రభుత్వం ఏర్పరచిన దిశ చట్టాన్ని యువతులు, మహిళలు తమ రక్షణకై ఆయుధంగా వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి మీనకుమారి, సిబ్బంది సుజాత, మహిళా పాఠకులు, గ్రంథాలయ సభ్యులు పాల్గొన్నారు.

## సొమ్ము ఒకరిది సోకు ఒకరిది
- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై నిషిధరాజు విమర్శ



వడమాలపేట, నవంబరు 19 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం పలు పథకాలకు నిధులు విడుదల చేస్తుంటే సొమ్ము ఒకరిది సోకొకరిది అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వాళ్ళ స్టిక్కర్లు వేసుకుంటూ ప్రచారం చేసుకుంటుందని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఎం.నిషిధరాజు విమర్శించారు. వడమాలపేట మండలం ఎస్వీ పురం గ్రామంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో కిష్టయ్య నిర్మించిన నూతన గృహాన్ని నిషిధరాజు ఆదివారం రిబ్బన్ కత్తిరించి ఓపెన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రభుత్వానికి పీఎం కిసాన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కల్యాణ యోజన, ఉజ్వల యోజన, ఇలా ఎన్నో పథకాలకు కేంద్ర నిధులు విడుదల చేస్తుంటే కాని ఈ పథకాలన్ని తామే ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తమ స్టిక్కర్లు వేసుకుంటున్నారని వివరించారు. ప్రజలకు మంచి చేయాలనే తత్వం మోదీకి ఉందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గ కో-కన్వీనర్ సుబ్రహ్మణ్యం రాజు, పుత్తూరు మండలం అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు జగదీష్, కిష్టయ్య, సుబ్రమణి, దుర్గా సుజాత, శాంతి, ఉదయ్‌కుమారి, రమ్య, అమ్ముదా, శంకరయ్య, సుబ్రహ్మణ్యం, రవి ఆచారి, రవి పాల్గొన్నారు.

## ఫెక్సీల తొలగింపుపై మాజీ ఎమ్మెల్యే తనయుడి ఆగ్రహం
సత్యవేడు, నవంబర్ 19, ప్రభాతవార్త :
నియోజకవర్గంలో తాను ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం సమంజసం కాదని సత్యవేడు మాజీ ఎమ్మెల్యే సురాజ్ తనయుడు ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్యవేడు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థత్వాన్ని ఆనంద్ ఆశిస్తున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల దీపావళి పండుగ సందర్భంగా ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ సిఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి, తదితర కీలక నాయకుల ఫోటోలతో ముద్రించిన ఫ్లెక్సీలను నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. అయితే ఆఫ్లెక్సీలను గంటల వ్యవధిలోనే తొలగించేశారని, దీనికి కారణం అధికారపార్టీ నాయకులే అని ఆరోపిస్తూ ఆనంద్ సత్యవేడు మీడియాక్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. తెలిపితే వాటిని తొలగించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.

## రైతాంగం సమస్యలను పరిష్కరించండి
సత్యవేడు, నవంబర్ 19, ప్రభాతవార్త :



రైతాంగ సమస్యలను పరిష్కరించాలని తిరుపతి జిల్లా రైతుసంఘం నియోజకవర్గ సభ్యులు మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సత్యవేడులో రైతు సమస్యలపై సమావేశమై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగం సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కల్తీ విత్తనాలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో రైతులు పంటనష్టంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో తిరుపతి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి నాగార్జున, నాయకులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అపూర్వ కలయిక
పాతకేళ్ళ తరువాత కలుసుకున్న విద్యార్థులు
పుత్తూరురూరల్, నవంబరు 19 ప్రభాతవార్త:



పుత్తూరు మండలం గొల్లపల్లి జడ్పీ హైస్కూలులోని ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1998-1999 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాతికేళ్ళ తరువాత అక్కడ కలుసుకున్నారు. అప్పటి సంగతులు, అనుభూతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఇప్పటి జీవితాలు, కష్ట సుఖాలను ఒకరికొకరు పంచుకున్నారు. అదే విధంగా తమకు పాఠాలు నేర్పి విద్యాబుద్ధులు అందించిన పలువురు గురువులకు సన్మానం చేసి వారి పట్ల తమ గురు భక్తిని చాటుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులు ఎన్.ఎస్.దేవరాజన్, పి.వి.లక్ష్మినారాయణ, సాయినాథ్, టి.డి.సెల్వం, భానుమతి, హరిప్రసాద్ వర్మ, కృష్ణయ్య పాల్గొని ఆనందాన్ని వ్యక్తపరచారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**
I SUBRRAMANYAM VENKATAGIRI S/olate CHENGALRAYALUVENKATA GIRI, R/O H.No. 15-427,AMPUTTUR,BPAGRAHARAM,SRI KALAHASTI, TIRUPATHI 517640AP. HAVE CHANGED MY NAME AS SUBRAMANYAM VENKATAGIRI

## పుష్పయాగానికి మలయప్పకు స్నపనం



తిరుమల,నవంబర్ 19 ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమలేశునికి ఆదివారం జరిగిన పుష్పయాగమహోత్సవానికి ముందు ఆలయంలోని సంపంగిప్రాకారంలో ఆలయ అర్చకులు విశేష స్నపనతిరుమంజనం జరిపించారు. వేదమంత్రాల నడుమ... పాలు,పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరిజలంతో కలగలిపిన సుగందద్రవ్యాలతో స్నపనం నిర్వహించారు. పలురకాల పుష్పాలు, పండ్లు, రోజ్‌పెటల్స్, తులసిదండలు స్వామిఅమ్మవార్లకు అలంకరించారు. పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, జెఈఓ సదాభార్గవి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు పాల్గొన్నారు.





తిరుచానూరు అలిమేలుమంగమ్మ ఆలయంలో ఆదివారం సాయంత్రం పాంచరాత్ర ఆగమోక్తంగా పుష్పయాగం, టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి పాల్గొన్నారు

## నేడే కార్తీకదీపోత్సవం

### -2వేలమంది భక్తులు పాల్గొనేలా ఏర్పాట్లు



తిరుమల,నవంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:

పవిత్రమైన కార్తీకమాసం పురస్కరించుకుని నేడు(సోమవారం)సాయంత్రంటిటిడి పరిపాలన భవనం వెనుక మైదానంలో కార్తీక దీపోత్సవాలు నిర్వహిస్తున్నారు. 2వేలమంది గృహస్థభక్తులకు అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేశారు. సౌకర్యాలపై ఆదివారం టిటిడి జెఈఓ సదాభార్గవి, విజిఓ బాలిరెడ్డి, ధార్మికప్రాజెక్టుల ప్రోగ్రామ్‌అధికారి రాజగోపాల్, డిప్యూటీ సిఎఫ్ శ్రీనివాస్, పిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి పరిశీలించారు.సాయంత్రం 5.30గంటలకు స్వస్తితో దీపోత్సవం ప్రారంభమవుతుందని, అనంతరం దీపప్రశస్తి, విశ్వక్సేనపూజ,పుణ్యాహవచనం, విష్ణుసహస్రనామ పారాయణం, మహాలక్ష్మిపూజ, దీపలక్ష్మి నృత్యరూపకం, చివరగా కుంభ హారతితో రాత్రి 8.30గంటలకు దీపోత్సవం ముగుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమాలు సజావుగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## ప్రపంచకప్ భారత్ క్రికెటర్లు అందుకోవాలి

### -శివాలయంలో హోమం

తిరుపతి,నవంబర్ 19ప్రభాతవార్త:



ఆదివారం అహమ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచకప్పు క్రికెట్‌పోటీల్లో భారత్ క్రికెటర్లు గెలిచి కప్పును అందుకోవాలని ఆకాంక్షిస్తూ బిజెపి నాయ కులు హోమం నిర్వహించారు. ఆదివారం ఉదయం దేవేంద్రథియేటర్ సమీపంలోని శివాలయంలో స్వామివారికి విశేష హోమం జరిపించారు. బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, కెఎన్ రాజా, కస్పాపద్మనాభమ్, కల్యాణి, రాధారెడ్డి, తిరుపాలాచారి, విజయకుమార్, సుబ్రమణ్యంరెడ్డి కలసి వేదపండితులు వేదమంత్రోచ్చరణల నడుమ మహాహోమం జరిపించారు.

## శిల్పారామంలో ఆకట్టుకున్న భరతనాట్యం



తిరుపతి,నవంబర్ 19ప్రభాతవార్త:

పద్మావతిఅమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత ఆదివారం శిల్పారామంలో హరిప్రసాద్ రావు శిష్యబృందం భరత నాట్యం ఆహుతులను ఆకట్టుకుంది. నిత్య నృత్యాలయ డ్యాన్స్ స్కూల్ నిర్వాహకులు ఉమాదేవి, హరిప్రసాద్ చిన్నారుల భరతనాట్యం ప్రదర్శన అద్భుతంగా చేశారు.

## పాఠశాల పరిసరాలు శుభ్రం చేసిన అధికారులు

### 'వార్త'కు స్పందన

పాలసముద్రం, నవంబర్ 19 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం సింహరాజపురం ప్రాథమిక పాఠశాల ఆవరణను అధికారులు శుభ్రం చేశారు. సంహరాజపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో 'పడకేసిన పారిశుధ్యం' శీర్షికతో గురువారం 'వార్త' ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ 'వార్త'కు స్పందించిన ఎంపిడిఓ విద్యావతి, ఎంఇఓ రాజేంద్రప్రసాద్, ఇఓఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శి రాజేష్‌లు స్పందించి పాఠశాల ఆవరణను స్వచ్ఛభారత్ కార్మికుల చేత శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అన్ని పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా వుంచాలని ఎంపిడిఓ విద్యావతి, ఎంఇఓ రాజేంద్రప్రసాద్‌లు హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులను ఆదేశించారు.

## రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలు ప్రారంభం





బంగారుపాళ్యంలో ర్యాలీ చేస్తున్న క్రీడాకారులు. పోటీ పడుతున్న విజయనగరం, పశ్చిమ గోదావరి జిల్లాల జట్లు.

బంగారుపాళ్యం, నవంబర్ 19 ప్రభాతవార్త:

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని పోటీల నిర్వాహకులు తెలిపారు. అండర్-14 రాష్ట్ర స్థాయి బాలబాలికల ఖో-ఖో పోటీలకు బంగారుపాళ్యం క్రీడా మైదానం వేదిక అయ్యింది. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలిబాలికల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. వివిధ జిల్లాల నుండి విచ్చేసిన క్రీడాకారులు బంగారుపాళ్యం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈ పోటీలను ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటిసీ సోమశేఖర్‌లు ప్రారంభించారు. క్రీడాకారుల నుండి గౌరవవందనం స్వీకరించారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలను స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ప్రతిరోజు బాలబాలికల మధ్య ఈ పోటీలను ఫ్లడ్ లైట్ల నడుమ నిర్వహిస్తారు. మూడవ రోజు గెలుపొందిన జట్లకు షీల్డులు, సర్టిఫికేట్లు ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఓ బాలాజీ, గిరిజన పాఠశాల ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య, పిడి నాగయ్య, రాజేష్, దేవేంద్ర, గిరిజ, జిల్లా ఖోఖో సంఘ కార్యదర్శి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టికృషితో శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని అభివృద్ధి చేస్తాం

### -భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం..ఇఓ



శ్రీకాళహస్తి, నవంబర్ 19 ప్రభాతవార్త

సమిష్టికృషితో శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని అభివృద్ధి చేస్తామని ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలుతీసుకుంటామని ఆలయ నూతన ఇఓగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజు ఆలయ పరిపాలన భవనంలోని ఆలయ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటుచేసి సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా ఈవో రామారావు మాట్లాడుతూ ఆలయంలో ఎంతమంది పనిచేస్తున్నారు, ప్రతిరోజు ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య, ఆది, సోమ, శనివారాల్లో భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని సిబ్బంది ఈవోకు వివరించారు. కాగా ప్రస్తుతం కార్తీకమాసం కాబట్టి భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని స్థానిక భక్తులేకాకుండా తమిళనాడు, కేరళ, కర్నాటక, మహారాష్ట్రల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా భక్తులు విచ్చేసి స్వామిఅమ్మవార్లను దర్శించుకోవడంతో పాటు రాహుకేతు పూజలు నిర్వహించుకుంటారని తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయ వివరాలను తెలుసుకున్నారు. అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

**కార్తీకమాసం పరమపవిత్రం..ఈఓ రామారావు**



ఆలయ ఈవో కెఎస్.రామారావు బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు భక్తిభావంతో ఆలయ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులతో కలిసి కార్తీకదీపాన్ని వెలిగించారు. ధర్మకర్తల మండలి సభ్యురాలు శ్రీదేవి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

శ్రీకాళహస్తి, నవంబర్ 19 ప్రభాతవార్త



స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆదివారం కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏపిసిసి ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ 106వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతిగా ఆమె పేదల హృదయాల్లో శాశ్వత ముద్ర వేసుకున్నారన్నారు.నేడు దళిత, గిరిజన బడుగు వర్గాలు అనుభవిస్తున్న వెసులుబాట్లు అవి ఇందిరమ్మ పుణ్యమే అన్నారు. ఐరన్‌లేడిగా పేరు సంపాదించుకున్న ఆమె ఘనత ఎన్నటికీ జనం మరువరన్నారు.ఈ జయంతి కార్యక్రమాల్లో జానీబాషా, విజయశేఖర్, నాగూరయ్య, గోపి, శివయ్య, ఆర్ముగం, వానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా ప్రసన్న వెంకటేశ్వరుని కల్యాణోత్సవం



వడమాలపేట, నవంబరు 19 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున స్వామివారికి కల్యాణం జరిపించడం ఆనవాయితీ. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని పట్టు పీతాంబరాలు, పూలమాలలతో నూతన వధూవరులుగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో అగ్నిహోమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ వేదమంత్రాలతో మాంగల్యధారణ చేయించారు. మంగళ హారతులు ఇచ్చారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన మాధవరాజు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్, టీటీడీ సిబ్బంది, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన స్కంధ షష్ఠి ఉత్సవాలు

పుత్తూరురూరల్, నవంబరు 19 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో 97వ సంవత్సరం స్కంధ షష్ఠి ఉత్సవాలు ఆదివారంతో ముగిసింది. ఈ స్కంధ షష్ఠి ఉత్సవాలు 18వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారంతో ముగిసింది. ఉదయం ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం భక్తి ప్రవర్తలతో రాత్రి స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం కల్యాణోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం కూడా నిర్వహిం చారు. ఉభయ దాతగా రాచపాళెం గ్రామానికి చెందిన శల్యవైద్యులు ఎస్.ప్రకాష్‌రాజు జుగల్ కిషోర్ వ్యవహరించారు. కల్యాణోత్సవం ఉభయ దాతగా పుత్తూరుకు చెందిన ఏ.హరిప్రసాద్, ఏ.రాధికలు వ్యవహరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారం పర్య ధర్మకర్త ఎం.సుందరం, ఆలయ అర్చకులు శరవణ గురుకుల్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

గూడూరు, నవంబర్ 19, ప్రభాతవార్త



దేశ సేవలో ప్రాణాన్ని సైతం పోగొట్టుకున్న ఉక్కు మహిళ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోయాయని కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు పంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా గూడూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంట శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు సత్ఫలితాలను ఇచ్చిందన్నారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్, నెహెమియా, తాజుద్దీన్, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రేక్షకులతో కలిసి క్రికెట్ మ్యాచ్ వీక్షించిన రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి, నవంబర్ 19, ప్రభాతవార్త



భారత్ - ఆస్ట్రేలియా ఫైనల్ క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వైసిపి జిల్లా అధ్యక్షులు ఉన్నాయి. రామ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో పెద్దపాటి ఎల్ఈడి టీవీని ఏర్పాటు చేసారు. ప్రేక్షకులతోకలిసి ఆయన కొంతసేపు మ్యాచ్ తిలకించారు. వెంకటగిరి వాసులు క్రికెట్ మ్యాచ్‌ని ఆనందంగా వీక్షించేందుకు పెద్దపాటి టీవీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు లక్కమనేని కోటేశ్వర రావు, ప్రసాద్ రెడ్డి, వెంకటేశ్వర రావు, తదితరులు వీక్షించారు.

## చారిత్రక, ఆధ్యాత్మిక విషయాల కలబోత పుణ్యభూమి పుస్తకం

### వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాశ్





పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జయప్రకాశ్ తదితరులు, డాక్టర్ విజయకుమారికి తొలి ప్రతిని అందిస్తున్న ప్రొఫెసర్ రమశ్రీ

పుత్తూరు, నవంబరు 19 ప్రభాతవార్త :

హిందు మతానికి పునాది లాంటి సనాతన ధర్మం, భరత ఖండం ప్రాశస్త్యం వంటి అంశాలపై రాష్ట్ర చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి ఓఎస్‌డి డాక్టర్ ఎం.ప్రభాకర్ రచించిన పరిశోధనాత్మక పుస్తకాన్ని పుత్తూరు మునిసిపాలిటీ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాశ్ (చిట్టి) శనివారం వడమాలపేట మండలంలో అప్పలాయిగుంటలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక, ఆధ్యాత్మిక అంశాలపై కొన్నేళ్లుగా ప్రభాకర్ చేస్తున్న పరిశోధన ఫలితమే ఈ పుణ్యభూమి పుస్తకమని పేర్కొన్నారు. పుస్తకావిష్కరణ చేయడం అన అదృష్టమని తెలిపారు. గతంలో పుత్తూరులో తమ సాయిజ్యోతి విద్యా సంస్థల తరపున ఆయన రచించిన 'నో మోర్ టియర్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించామని తెలిపారు. పుస్తక రచయిత డాక్టర్ ప్రభాకర్ స్నేహానికి ప్రాణమిచ్చే వ్యక్తిత్వం కలవారని ప్రశంసించారు. సాహితి మిత్ర, లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డులు అందుకున్నారని తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీలో తాను ఇంగ్లీష్, ప్రభాకర్ చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసినప్పటి నుంచి తమ స్నేహం కొనసాగుతోందని తెలిపారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావం నెలకొలేలా ఆయన మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షించారు. పుస్తక రచయిత డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ మూఢంగా కాకుండా తత్వజ్ఞానం, ధర్మమార్గంతో కూడినందు వల్లే హిందు మతాన్ని సనాతన ధర్మమని అంటారని తెలిపారు. వేదాలు, బ్రహ్మ సూత్రాలు, భగవద్గీత ఈ మూడింటిని కలిసి ప్రస్థానత్రయం అని పిలుస్తారన్నారు. భూమిని, ప్రకృతిని భోగ వస్తువులుగా పరిగణించకుండా దైవ స్వరూపంగా చూసేది ఒక్క సనాతన ధర్మమేనని తెలిపారు. ఇటువంటి అనేక ధార్మిక అంశాలతో పుణ్యభూమి పుస్తకాన్ని రచించినట్టు తెలిపారు. ఉన్నతాధికారులుగా విధి నిర్వహణలో వున్నంత కాలం నిజాయితీగా వ్యవహరించిన దివంగత ఐఎఎస్ అధికారి, చిత్తూరు జిల్లా మాజీ కలెక్టర్ టి.జనార్ధన్ నాయుడు, అతని సోదరుడు దివంగత ఐపిఎస్ అధికారి టి.శ్రీనివాసులు నాయుడులకు పుణ్యభూమి పుస్తకాన్ని అంకితం చేసినట్టు తెలిపారు. అనంతరం పుస్తకం తొలి ప్రతిని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ విజయకుమారికి ఎస్వీ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ టి.రమశ్రీ అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వై.వెంకటేశ్వర్లు భాగవతార్, న్యాయవాది బి.రవీంద్ర, జ్ఞానజ్యోతి విద్యాసంస్థ కరస్పాండెంట్ ఎ.హరినాథ్‌రెడ్డి, పుత్తూరు మునిసిపాలిటీ రెండో వైస్‌ఛైర్మన్ డి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.